Sakshi Dt-08/07/18.

# కనువిందు చేస్తున్న సైడ్‌వాక్స్

- జూబ్లీహిల్స్‌లో రోడ్లకు ఇరువైపులా పూలమొక్కలు
- అక్రమ పార్కింగ్‌లు, వ్యాపారాల నిరోధానికి బొల్లార్డ్స్ ఏర్పాటు
- హర్షం వ్యక్తం చేస్తున్న స్థానికులు, పాదచారులు



జూబ్లీహిల్స్ రోడ్ నెం.36లో కనువిందు చేస్తున్న సైడ్ వాక్స్



ప్రపంచ ప్రమాణాలతో ఆకట్టుకుంటున్న ఫుట్‌పాత్

బంజారాహిల్స్: పచ్చగా పెరిగిన మొక్కలు.. ఆకర్షణీయమైన పూలజాతులు... ఖరీదైన టైల్స్‌తో నడకదారులు.. అందంగా తీర్చిదిద్దిన రహదారుల పక్కన నడక ఎంత ఆనందంగా ఉంటుందో, మరెంత సౌలభ్యంగా భద్రతతో ఉంటుందో జూబ్లీహిల్స్ రోడ్ నెం.36లోని ఈ ఫుట్‌పాత్‌లను చూస్తే తెలుస్తుంది. ప్రపంచ ప్రమాణాలతో జూబ్లీహిల్స్ చౌరస్తా నుంచి రోడ్ నెం.36 పెద్దమ్మగుడి, మాదాపూర్ పోలీస్ స్టేషన్ మీదుగా హైటెక్‌సిటీ సైబర్‌టవర్స్ వరకు ఐదు కిలోమీటర్ల మేర రహదారికి ఇరువైపులా తీర్చిదిద్దిన డిజైనర్ సైడ్‌వాక్స్ ఈ రోడ్డుకే కొత్త అందాలను తీసుకొచ్చాయి. రోడ్ నెం.36 నుంచి సైబర్‌టవర్స్ వరకు ఇటీవలనే మెట్రో రైలు నిర్మాణపనులు పూర్తయ్యాయి. మెట్రో కారిడార్ నిర్మాణం మొత్తం ఈ రోడ్డంతా డిజైనర్ సైడ్‌వాక్‌లను అభివృద్ధి చేశారు. ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు ప్రత్యేక ఆదేశాలతో హెచ్‌ఎంఆర్ రూపొందించిన ప్రణాళికలు, అమలు చేసిన విధానంతో ఈ రోడ్డుకు కొత్త ఆకర్షణ చేకూరింది. ఒక వైపు సైడ్‌వాక్‌లు, ఇంకోవైపు ఫుట్‌పాత్‌లు, రెండు వైపులా పూల మొక్కలు, వాటి పక్కనే వరద నీరు వెళ్లేందుకు వీలుగా సాసర్‌టైప్ కాల్వలను నిర్మించారు. ఇటీవలనే మెట్రో రైలు ఎండీ ఎన్వీఎస్ రెడ్డి ఈ రోడ్డులో పర్యటించి డిజైనర్ సైడ్‌వాక్‌లను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు.

**సుందరంగా ఫుట్‌పాత్‌లు...**

ప్రపంచంలోనే బ్రాండెడ్ రోడ్లలో ఒకటిగా జూబ్లీహిల్స్ రోడ్ నెం.36 గుర్తింపుపొందిన నేపథ్యంలో దీనికి మరింత అదనపు ఆకర్షణను తీసుకొస్తూ ఫుట్‌పాత్‌లు సుందరంగా తీర్చిదిద్దారు. ఇప్పుడు రోడ్డుపైన నడవాల్సిన అవసరం లేకుండా పాదచారులు ఈ ఫుట్‌పాత్‌పైనే నేరుగా ఎలాంటి ప్రమాదాలకు గురికాకుండా నడిచే అవకాశాలు కల్పించారు. ఫుట్‌పాత్‌లపైకి వాహనాలు ఎక్కకుండా బొల్లార్డ్స్ నిర్మించారు. అంతే కాకుండా షోరూంలు, మాల్స్ ముందు అక్రమ పార్కింగ్‌లు లేకుండా బొల్లార్డ్స్‌ను ఏర్పాటు చేయడంతో వినియోగదారులు తప్పనిసరిగా ఆయా కాంప్లెక్స్‌ల సెల్లార్లలో వాహనాలను పార్కింగ్ చేసుకోవడానికి అవకాశం ఏర్పడింది. ఇదిలా ఉండగా నగరంలోని అన్ని ప్రాంతాల్లో ఇలాంటి సైడ్‌వాక్స్ నిర్మించాలని పాదచారులు కోరుతున్నారు. ముఖ్యంగా హైదరాబాద్ మెట్రో రైలు కారిడార్ నిర్మాణ ప్రాంతాలన్నింటికీ ఇరువైపులా జూబ్లీహిల్స్ తరహా డిజైనర్ సైడ్‌వాక్‌లు నిర్మించడం ద్వారా పాదచారులకు ఆనందంతో పాటు భద్రత కూడా ఏర్పడుతుందని వారు అంటున్నారు. ఇందులో భాగంగానే జీహెచ్‌ఎంసీ అధికారులు ఇటీవల పాదచారులు అధికంగా రాకపోకలు సాగించే పలు ప్రాంతాలను గుర్తించి ఆ జాబితాను హెచ్‌ఎంఆర్ నిర్వాహకులకు అందించారు.

**చిరువ్యాపారాలకు అడ్డుకట్ట...**

ఇదిలా ఉండగా డిజైనర్ సైడ్‌వాక్ ద్వారా ఫుట్‌పాత్‌ల ఆక్రమణలు కూడా నిరోధించేందుకు అవకాశం ఏర్పడింది. ఏ ఒక్కరు కూడా ఈ ఫుట్‌పాత్‌లపై చిరు వ్యాపారాలు చేయడానికి వీల్లేకుండా పటిష్టమైన ఏర్పాట్లు చేశారు. ఓ వైపు ఫుట్‌పాత్ ఆక్రమణలను నిరోధించడం, ఇంకోవైపు అక్రమ పార్కింగ్‌లను అరికట్టడం, దీనికి తోడు పాదచారులు స్వేచ్ఛగా నడిచేందుకు వీలు కల్పించే లక్ష్యంగా విదేశీ నగరాల తరహాలో నిర్మించిన ఈ ఫుట్‌పాత్‌లు సీఎం కేసీఆర్‌ను కూడా ఆకట్టుకున్నాయి.